బీజేపీని ఓడించడమే

సామాజిక శక్తుల లక్ష్యం

● హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్

7 లో..

అరచేతిలో బ్రహ్మాస్త్రం

● ఎన్నికల్లో జరిగే అక్రమాలు, కోడ్ ఉల్లంఘనలపై ఫిర్యాదులకు సీ-విజిల్ యాప్ వేదిక

● ఆధునికీకరణతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం

● 100 నిమిషాల్లో అధికారుల విచారణ

సిద్దిపేట అగ్రికల్చర్, ఏప్రిల్ 24 : ఎన్నికల్లో జరిగే అక్రమాలపై ఫిర్యాదు చేసేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన సీ-విజిల్ యాప్ పౌరుల చేతిలో బ్రహ్మాస్త్రంగా మారింది. ప్రస్తుతం ఈ యాప్‌ను ఆధునికీకరణతో పాటు ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం చేశారు. అక్రమాలకు సంబంధించిన ఫొటో యాప్‌లో అప్‌లోడ్ చేస్తే 100 నిమిషాల్లో దర్యాప్తు చేసి ఫిర్యాదుదారుడికి సమాచారం తెలియజేస్తారు. ఈ సమాచారం జిల్లా ఎన్నికల అధికారితో పాటు నియోజకవర్గ పరిధిలోని ఫ్లయింగ్ స్క్వాడ్‌కు చేరుతుంది. ఎవరైనా కోడ్‌ను ఉల్లంఘించినా, వివిధ పార్టీల అభ్యర్థులు, నాయకులు ఓటర్లను డబ్బు, మద్యం, బహుమతుల వంటివి పంచి ప్రలోభాలకు గురిచేసినా ఈ వివరాలను నేరుగా యాప్‌లో ఫిర్యాదు చేయవచ్చు. ప్రచారంలో అనుమతులు లేకుండా లైడ్ స్పీకర్ వాడటం ఇతర నిబంధనలు ఉల్లంఘించినా, కులమతాలను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా, ర్యాలీలు తీసినా ఈ యాప్‌లో ఫిర్యాదు చేసే అవకాశం కల్పించారు.

యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోండిలా..

స్మార్ట్‌ఫోన్ ఉన్న వారు ఈ యాప్‌ను గూగుల్, యాపిల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్లే స్టోర్‌కు వెళ్లి సీ-విజిల్ యాప్ అని టైప్ చేయగా.. 8.41 ఎంబీ ఉన్న యాప్ కనిపిస్తుంది. దానిని డౌన్‌లోడ్ చేసుకున్న అనంతరం భాషను ఎంచుకోవాలి. ఆ తర్వాత అక్కడ సూచించే వివిధ నిబంధనలను అంగీకరిస్తున్నట్లుగా టిక్ చేయాలి. అనంతరం సీ-విజిల్ ఎన్నికల కమిషన్ ఆఫ్ ఇండియా అనే యాప్ సెల్‌ఫోన్ స్ర్కీన్‌పై కనబడుతుంది. ఆ తర్వాత సెల్‌ఫోన్ నెంబర్ ఎంటర్ చేస్తే ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా నుంచి ఎస్ఎంఎస్ ద్వారా నాలుగు నంబర్ల ఓటీపీ వస్తుంది. దాన్ని ఎంటర్ చేసిన తరువాత వినియోగదారుడికి సంబంధించిన పూర్తి వివరాలు వినియోగదారుడి అడ్రస్, పిన్‌కోడ్, నియోజకవర్గం, జిల్లా, రాష్ట్రం వంటి పూర్తి వివరాలు పొందుపరచాలి. అనంతరం యాప్ ఓపెన్ అయి ఫొటో, వీడియో, ఆడియో లోగోలు కనిపిస్తాయి. వినియోగదారుడు తన ప్రాంతంలో జరిగిన కోడ్ ఉల్లంఘనలపై ఫొటో లేదా వీడియో, ఆడియో రూపంలో లోగోను బట్టి ఎంచుకుని అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆ ఫిర్యాదు నేరుగా ఎన్నికల సంఘానికి చేరుతుంది. వారు పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేస్తారు. ఈ యాప్‌లో ఎన్నికల సమయంలో చుట్టుపక్కల జరుగుతున్న కోడ్ ఉల్లంఘనలు పొందుపరుచవచ్చు. ఈ యాప్ ద్వారా ఫిర్యాదు అందిన 10 నిమిషాల వ్యవధిలోనే ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని 100 నిమిషాల వ్యవధిలో చర్యలు తీసుకుంటారు. సిద్దిపేట జిల్లాలో పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు సీ-విజిల్ యాప్‌లో 14 ఫిర్యాదులు రాగా.. వాటిని పరిష్కరించారు.



ఇంటర్‌లో బ్యాక్ బెంచ్..!

పడిపోయిన ఉత్తీర్ణత

● ఉసూరుమనిపించిన జిల్లా విదార్థులు

● ప్రథమ సంవత్సరంలో 48.01 శాతం, ద్వితీయ సంవత్సరంలో 60.77 శాతం

● ఫలితాల్లో బాలికలదే హవా

● రాష్ట్రస్థాయిలో సిద్దిపేట 28వ స్థానం

● క్రమంగా పడిపోతున్న గ్రాఫ్

● కొరవడిన అధికారుల పర్యవేక్షణ!

● ఉనికి కోల్పోతున్న ప్రభుత్వ కళాశాలలు



సిద్ది పేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఫలితాలను చూపెడుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 24 : ఇంటర్ ఫలితాల్లో సిద్దిపేట జిల్లా ఈసారి వెనుకంజలో నిలిచింది. ప్రథమ సంవత్సరంలో 48.01శాతం, ద్వితీయ సంవత్సరంలో 60.77 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. గతేడాదితో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం గణనీయంగా పడిపోయింది.

ఇంటర్ జనరల్‌లో..

ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 7,541 మంది పరీక్షలు రాయగా 3,678మంది ఉత్తీర్ణత (48.77శాతం) సాధించారు. వీరిలో 3,251 మంది బాలురు పరీక్ష రాయగా 1181 మంది ఉత్తీర్ణత (36.33శాతం) సాధించారు. 4,290 మంది బాలికలు పరీక్ష రాయగా 2,497మంది (58.21శాతం) ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌లో 7,361 మంది పరీక్ష రాయగా 4,496 మంది ఉత్తీర్ణత (61.08శాతం) సాధించారు. వీరిలో 3,172 మంది బాలురు పరీక్ష రాయగా 1,580 మంది ఉత్తీర్ణత (49.81శాతం) సాధించారు. 4,189 మంది బాలికలు పరీక్ష రాయగా 2,916 మంది ఉత్తీర్ణత(69.61శాతం) సాధించారు.

ఒకేషనల్‌లో..

ఇంటర్ ఒకేషనల్ ఫస్టియర్‌లో 2,677మంది పరీక్ష రాయగా 1,135 మంది ఉత్తీర్ణత (42.40శాతం) సాధించారు. వీరిలో 1,563 మంది బాలురు పరీక్ష రాయగా 428 మంది ఉత్తీర్ణత(27.38శాతం) సాధించారు. 1114 మంది బాలికలు పరీక్ష రాయగా 707 మంది ఉత్తీర్ణత(63.46శాతం) సాధించారు. ఇంటర్ సెకండ్ ఇయర్‌లో 2,461 మంది పరీక్ష రాయగా 1,329 మంది ఉత్తీర్ణత (54 శాతం) సాధించారు. వీరిలో 1,283 బాలురు పరీక్ష రాయగా 478 మంది ఉత్తీర్ణత(37.26 శాతం) సాధించారు. 1178 బాలికలు పరీక్ష రాయగా 851 మంది ఉత్తీర్ణత(72.14శాతం) సాధించారు.



ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో 468 మార్కులు సాధించిన కావ్యకు స్వీట్ తినిపిస్తున్న మాస్టర్ మైండ్ కాలేజ్ యాజమాన్యం

బాలికలదే పైచేయి

ఇంటర్ ఫలితాల్లో బాలికల హవా కొనసాగింది. ఇంటర్మీడియట్ ఫస్ట్‌ఇయర్ ఫలితాల్లో బాలురు 36.33శాతం, బాలికలు 58.21శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌లో బాలురు 49.81 శాతం, బాలికలు 69.61శాతం ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ఇంటర్ ఫస్టియర్‌లో బాలురు 27.38శాతం, బాలికలు 63.46 శాతం ఉత్తీర్ణత సాధించారు. సెకండ్ ఇయర్‌లో బాలురు 37.26 శాతం, బాలికలు 72.14 శాతం ఉత్తీర్ణత సాధించారు.

28వ స్థానానికి..

జిల్లాలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత శాతం క్రమంగా తగ్గుతూ వస్తుంది. 2021-22 ఇంటర్ ఫలితాల్లో ఫస్ట్ ఇయర్‌లో 63శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 8వ స్థానం, సెకండ్ ఇయర్‌లో 68శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 6వ స్థానం దక్కించుకున్నది. 2022-23 ఫలితాల్లో ఫస్ట్ ఇయర్‌లో 52 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 15వ స్థానం, సెకండ్ ఇయర్‌లో 65శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 11వ స్థానం దక్కించుకున్నది. ఈసారి ఫలితాల్లో ఫస్ట్‌ఇయర్‌లో 48.77 శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలో 29వ స్థానం, సెకండ్ ఇయర్‌లో 61.08 శాతం ఉత్తీర్ణతతో 28వ స్థానానికి పడిపోయింది. రెండేళ్ల ఫలితాలతో పోలిస్తే ఈసారి ఉత్తీర్ణత శాతం భారీగా తగ్గింది. అయితే అధికారుల నిర్లక్ష్యం వల్లే ఈ విధమైన ఫలితాలు వచ్చాయని తల్లిదండ్రులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఏ ఒక్క అధికారి కూడా ప్రభుత్వ కళాశాలలను, విద్యార్థుల చదువును పట్టించుకోలేదని ఆరోపిస్తున్నారు. గతంలో హరీశ్‌రావు ప్రత్యేక శ్రద్ధ వహించడం ఎప్పటికప్పుడు సమీక్షలు నిర్వహించడంతో మెరుగైన ఫలితాలు వచ్చాయని, ఈసారి ఎవరూ శ్రద్ధ చూపకపోవడంతో ఉత్తీర్ణత శాతం పడిపోయిందని పలువురు అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ కళాశాలల్లో అంతంత మాత్రమే..

జిల్లాలో ఉన్న 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏ ఒక్క కళాశాలలో కూడా 100 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించలేదు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల 61.74 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో మొదటిస్థానంలో నిలిచింది. తొగుట జూనియర్ కాలేజ్ 60.19 ఉత్తీర్ణతతో రెండో స్థానం, నంగునూరు కళాశాల 58.82 శాతం ఉత్తీర్ణతతో మూడో స్థానంలో నిలిచింది. సెకండ్ ఇయర్‌లో నంగునూరు కళాశాల 88.57 శాతం ఉత్తీర్ణతతో జిల్లాలో మొదటిస్థానం, కోహెడ ప్రభుత్వ జూనియర్ కళాశాల 82.76 శాతం ఉత్తీర్ణతతో రెండోస్థానం, హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల 81.93 శాతం ఉత్తీర్ణత మూడో స్థానంలో నిలిచాయి. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండ్ ఇయర్ బైపీసీలో ఎండీ. బిలాలుద్దీన్ 957 మార్కులు, ఎంపీసీలో విజయ రాఘవ 911మార్కులు సాధించారు.

ఫలితాల్లో సత్తాచాటిన ప్రైవేట్ కళాశాలలు

ఇంటర్ ఫలితాల్లో ప్రైవేట్ కళాశాల విద్యార్థులు హవా కొనసాగించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మాస్టర్ మైండ్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్ ఎంపీసీలో ఎస్. కావ్య 470 మార్కులకు 468 మార్కులు సాధించింది. బైపీసీలో రాజేష్ 440 మార్కులకు గాను 436 మార్కులు సాధించాడు. ఇదే కళాశాలలో సెకండ్ ఇయర్‌లో ఎంపీసీలో ఆయేషా సిద్ధిక్యు 988 మార్కులు, సందర్శిని 988 మార్కులు, బైపీసీలో గౌతమి 971 మార్కులు సాధించారు. గురు కృప కళాశాలలో ఫస్ట్ ఇయర్ ఎంపీసీలో ఐదుగురు విద్యార్థులు 466మార్కులు, సెకండ్ ఇయర్ ఎంపీసీలో దివిత 988 మార్కులు, బైపీసీలో సుమయ్య ఫాతిమా 981 మార్కులు సాధించారు.

నేటి నుంచి ఓటరు స్లిప్‌ల పంపిణీ

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 24 : నేటి నుంచి మే 8 వరకు ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ చేస్తామని ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరి క్రాంతి తెలిపారు. జహీరాబాద్ పార్లమెంట్ నియోజవర్గ సాధారణ ఎన్నికల పరిశీలకుడిగా గోపాల్ జి.తివారిని ఎన్నికల సంఘం నియమించగా, బుధవారం ఆయన సంగారెడ్డి కలెక్టరేట్‌కు విచ్చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల ఓటర్ల వివరాలను, పోలింగ్ ఏర్పాట్లను కలెక్టర్ ఆయనకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా గోపాల్ జి.తివారి మాట్లాడుతూ ప్రశాంత వాతావరణలో ఎన్నికలు జరిగేలా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని చర్యలు తప్పవని హెచ్చరించారు.



బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు

అమిత్‌షా సభకు ఏర్పాట్లు పూర్తి

● నేడు సిద్దిపేటలో బీజేపీ విజయసంకల్ప సభ

● భారీ బందోబస్తు ఏర్పాటు : సీపీ అనురాధ

సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 24 : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో నేడు జరగనున్న బీజేపీ విజయసంకల్ప బహిరంగ సభకు ముఖ్య అతిథిగా కేంద్ర మంత్రి అమిత్ షా రానున్నారు. గురువారం ఉదయం ఆయన 9.10గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి 11.10 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారు. అక్కడి ననుంచి 11.15కు హెలికాప్టర్‌లో బయలుదేరి సిద్దిపేట కలెక్టర్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు 11.45కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన 11.55 నిమిషాలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన వేదిక వద్దకు చేరుకుంటారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు ఆయన సభలో పాల్గొంటారు. 2011లో చేపట్టిన స్వర్ణజయంతి రథయాత్ర కార్యక్రమంలో భాగంగా సిద్దిపేటకు ఎల్‌కె అద్వానీ రాగా ఇన్నేళ్ల తర్వాత మళ్లీ కేంద్ర హోం మంత్రి స్థాయిలో నేడు అమిత్ షా వస్తున్నారని పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన రఘునందన్ రావు

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో అమిత్ షా బహిరంగ సభకు సంబంధించిన ఏర్పాట్లను బుధవారం సాయంత్రం బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిద్దిపేట, దుబ్బాక, గజ్వేల్, నియోజక వర్గాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో బహిరంగ సభకు హాజరుకావాలని కోరారు.

బహిరంగ సభకు భారీ బందోబస్తు : సీపీ

అమిత్‌షా బహిరంగ సభకు భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ అనురాధ తెలిపారు. బుధవారం సాయంత్రం పోలీస్ అధికారులకు, సిబ్బందికి బందోబస్తుకు సంబంధించి సీపీ పలు సూచనలు చేశారు. అనంతరం సీపీ, పోలీసులు అధికారులు హెలీప్యాడ్, బహిరంగ సభ జరిగే ప్రాంతాన్ని పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మొత్తం 12 సెక్టార్లుగా డ్యూటీలు విభజించినట్లు చెప్పారు.

పార్కింగ్ ప్రదేశాలు

మెదక్ రోడ్డు గవర్నమెంట్ హైస్కూల్, జూనియర్ కళాశాల గ్రౌండ్
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పీజీ కాలేజ్ గ్రౌండ్
నాగదేవత టెంపుల్ పరిసర ప్రాంతాల్లోని ఖాళీ ప్రదేశం

వీఐపీ పార్కింగ్

బాలాగౌడ్ ఫంక్షన్‌హాల్ ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశం

ట్రాఫిక్ డైవర్షన్ పాయింట్స్

సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ అంబేద్కర్ చౌరస్తా
నాగదేవత టెంపుల్ చౌరస్తా, ఎన్సాన్‌పల్లి చౌరస్తా
హైదరాబాద్ రోడ్డు బీజేఆర్ చౌరస్తా





రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు

నామినేషన్ల జాతర

● కలెక్టరేట్‌ల వద్ద కార్యకర్తల కోలాహలం

● నేటితో ముగియనున్న స్వీకరణ

సంగారెడ్డి టౌన్/మెదక్ అర్బన్, ఏప్రిల్ 24 : ఎన్నికల రిటర్నింగ్ అధికారుల కార్యాలయాల వద్ద బుధవారం నామినేషన్ల జాతర కొనసాగింది. కలెక్టరేట్‌ల వద్ద ఆయా పార్టీల కార్యకర్తల హడావిడితో కోలాహలంగా మారింది. పార్లమెంట్ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల దాఖలుకు నేటితో తెరపడనున్నది. ఈ నెల 18 నుంచి మొదలైన నామినేషన్ల స్వీకరణ గురువారంతో ముగియనున్నది. దాఖలైన నామినేషన్ల పరిశీలన 26న ఉంటుంది. నామినేషన్ల ఉపసంహరణకు 29 వరకు గడువుగా ఎన్నికల సంఘం నిర్ణయించింది.

జహీరాబాద్‌కు పది నామినేషన్లు

జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి ఏడో రోజైన బుధవారం నాడు 10 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఆయా పార్టీలకు చెందిన అభ్యర్థులు సంగారెడ్డిలోని కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి వల్లూరు క్రాంతికి నామినేషన్ పత్రాలను అందజేశారు. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులతోపాటు ఆయా పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్ పత్రాలను అందజేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ మంజుశ్రీ, డీసీసీబి వైస్ చైర్మన్ మాణిక్యంతో కలిసి బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మూడు సెట్‌ల నామినేషన్‌లను దాఖలు చేశారు. రాష్ట్ర వైద్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డితో కలిసి కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ నాలుగు సెట్‌ల నామినేషన్‌లను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. అలాగే ధర్మ సమాజ్ పార్టీ తరఫున దేవ శిఖామణి, రాష్ట్ర సామాన్య పార్టీ తరఫున మహ్మద్ మున్వర్ హుస్సేన్, బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బాలరాజ్, స్వతంత్రులు తలారి అశోక్, జైపాల్‌నాయక్, రమేష్ సజ్జాపూర్, యాకూబ్ షరీఫ్, గొల్లపల్లి మణయ్య నామినేషన్ పత్రాలను అందజేశారు.

మెదక్ లోక్‌సభకు 12..

మెదక్ పార్లమెంట్‌కు బుధవారం ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు స్వతంత్రులు, ఇతర పార్టీల తరఫున అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మెదక్ కలెక్టరేట్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి ఎమ్మెల్యేలు సునితాలక్ష్మారెడ్డి, చింతా ప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులతో కలిసి రెండు సెట్ల నామినేషన్లను దాఖలు చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మదన్‌రెడ్డితో కలిసి నామినేషన్ అందజేశారు. అలాగే ధర్మసమాజ్ పార్టీ నుంచి ఎ.లక్ష్మణ్, విముక్తి చిరుతల కక్షి పార్టీ తరఫున ఉరెల్లి ఎల్లయ్య, యుగ తులసి పార్టీ నుంచి అనిల్ మొగిలి, స్వతంత్రులుగా కమ్మరి లక్ష్మీనారాయణ, చిక్కులపల్లి నవీన్, ఉట్ల రమేష్, ప్రదీప్‌కుమార్, ఏటి ఆంజనేయులు, ధర్మారం నరహరి, దాసరి భానుచందర్ నామినేషన్లు దాఖలు చేశారు.





రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న జహీరాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్, బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్



సంగారెడ్డిలో నిర్వహించిన కాంగ్రెస్ ర్యాలీలో పాల్గొన్న అభ్యర్థి సురేష్‌షెట్కార్, మంత్రి దామోదర్ రాజనర్సింహ

కలెక్టరేట్‌ల వద్ద సందడి

మెదక్, సంగారెడ్డి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ కార్యాలయాలు అభ్యర్థులు, వారి తరఫున వచ్చిన వారితో సందడిగా మారింది. ఒక్కొక్కరు పలు సెట్లు దాఖలు చేయడంతో చాలా సమయం కార్యాలయాల్లోనే ఉన్నారు. ఇక కలెక్టరేట్ల గేటు వద్ద కార్యకర్తలు, నేతలతో కోలాహలంగా మారింది. జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో భాగంగా బుధవారం సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద ఆయా పార్టీల కార్యకర్తలతో హడావిడిగా కనిపించింది. నామినేషన్లు దాఖలు చేయడానికి ఆయా పార్టీల అభ్యర్థుల తరఫున వందలాది మంది కార్యకర్తలు కలెక్టరేట్ వద్దకు చేరుకోవడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తాయి. కాంగ్రెస్ అభ్యర్థి సురేష్‌షెట్కార్ నామినేషన్ వేయడానికి మద్దతుగా వందలాది మంది కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంగారెడ్డికి తరలివచ్చారు. బైపాస్ రోడ్డులోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్ మాత్రం జన సందడి లేకుండా నామినేషన్ దాఖలు చేశారు. అలాగే స్వతంత్ర అభ్యర్థి జైపాల్‌నాయక్ వినూత్నంగా ఎడ్లబండిపై గిరిజనుల డప్పుచప్పుళ్లు, కోలాటాలతో ర్యాలీగా వచ్చారు. సంగారెడ్డి కలెక్టరేట్ వద్ద వందలాది మంది కార్యకర్తలతో సందడిగా మారగా వారిని అదుపు చేయడం పోలీసులకు సమస్యగా మారింది. కలెక్టరేట్ వద్ద పోలీస్ వాహనం మొరాయించడంతో దాన్ని పోలీసులు నెట్టుకుంటూ కలెక్టరేట్‌లోకి తీసుకెళ్లారు. మెదక్ పట్టణంలో మెదక్ పార్లమెంట్ అభ్యర్థులు అంతగా భారీ ర్యాలీలు ఏం చేపట్టలేదు. హంగూఆర్భాటాలు లేకుండానే నామినేషన్లు వేశారు. బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రాంరెడ్డి, నీలం మధు కీలక నేతలతో, వందలాది మంది కార్యకర్తలతో కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు కార్యకర్తలతో ర్యాలీ నిర్వహించి పెద్దగా హంగామా లేకుండానే నామినేషన్ దాఖలు చేశారు. గత ఎన్నికల్లో భారీ ర్యాలీలతో హంగామా సృష్టించినా, ఈసారి అంతగా హడావుడి కనిపించ లేదు. నామినేషన్లు దాఖలు అనంతరం రోడ్డుషోలకు ప్రధాన పార్టీలు ప్రాధాన్యతను ఇస్తున్నాయి. ప్రతీ ఖర్చు అభ్యర్థి ఖాతాలో జమకానుండడంతో ర్యాలీలను తగ్గించినట్లు తెలిసింది.

ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి: ఎంపీడీవో


మొక్కను నాటుతున్న ఎంపీడీవో

మునిపల్లి, ఏప్రిల్ 24: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఎంపీడీవో హరినందన్‌రావు తెలిపారు. బుధవారం మండల కేంద్రమైన మునిపల్లి ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో మామిడి మొక్కను నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మొక్కలు నాటి, వాటి సంరక్షణకు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాజు, రమేష్, ప్రవీణ్, మురళి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపుపై దాడి.. మద్యం బాటిళ్ల స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేస్తున్న మద్యం బాటిళ్లు

చిన్నకోడూరు, ఏప్రిల్ 24: బెల్టుషాపుపై పోలీసులు దాడిచేసి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్న సంఘటన మండలంలోని చంద్లాపూర్ గ్రామంలో జరిగింది. చిన్నకోడూరు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. చంద్లాపూర్ గ్రామానికి చెందిన బూర కిషన్ తన ఇంటిలో ఎలాంటి అనుమతి లేకుండా బెల్టుషాపు నిర్వహిస్తున్నాడని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. ఈ మేరకు బుధవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు కలిసి సంయుక్తంగా దాడిచేశారు. సుమారు 6 లీటర్ల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఈనెల 26 నుంచి రాణాపూర్‌లో వీధి నాటకం

నారాయణఖేడ్, ఏప్రిల్ 24: మనూరు మండలం రాణాపూర్‌లో ఈనెల 26 నుంచి వచ్చేనెల 6 వరకు యేసుక్రీస్తు సంపూర్ణ జీవిత చరిత్ర వీధి నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం మొదటిభాగం, 28న రెండోభాగం, 30న మూడోభాగం, వచ్చేనెల 2న నాల్గోభాగం, 4న అయిదోభాగం, 6న చివరి భాగం నాట ప్రదర్శన ఉంటుందని వివరించారు. క్రైస్తవ సోదరులు అధిక సంఖ్యలో తిలకించి విజయవంతం చేయాలని కోరారు.





నంగునూరు మండలం కోనాయిపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న వెంకట్రామారెడ్డి దంపతులు, ఆలయంలో నామినేషన్ పత్రాలపై సంతకాలు చేస్తున్న వెంకట్రామారెడ్డి

ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే.. మీ కుటుంబసభ్యుడిగా ఉంటా..

● కోనాయిపల్లి వెంకన్న సాక్షిగా ట్రస్టు ఏర్పాటు చేసి పేదలకు సేవ చేస్తా

● బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి వెంకట్రామారెడ్డి

నంగునూరు, ఏప్రిల్ 24: తనను ఆశీర్వదించి పార్లమెంట్‌కు పంపిస్తే.. మీ కుటుంబసభ్యుల్లో ఒకడిగా ఉంటూ మీ సేవ చేసుకుంటానని బీఆర్‌ఎస్ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి, మాజీ కలెక్టర్ ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం కోనాయిపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాన్ని కుటుంబసమేతంగా దర్శించుకున్నారు. స్వామివారి పాదాల వద్ద నామినేషన్ పత్రాలు పెట్టి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం అక్కడే నామినేషన్ పత్రాలపై సంతకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను గెలిపిస్తే కోనాయిపల్లి వేంకటేశ్వరస్వామి సాక్షిగా పేదల కోసం రూ.100 కోట్ల సొంత నిధులతో ట్రస్టును ఏర్పాటు చేసి అన్నివిధాల ఆదుకుంటానన్నారు. నిరుపేద విద్యార్థుల ఉపాధి కల్పన కోసం ప్రత్యేకంగా కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఉచితంగా సేవలందిస్తానని హామీఇచ్చారు. ప్రజాదీవెనలు అందించి అత్యధిక మెజార్టీతో మెదక్ ఎంపీగా గెలిపించాలని కోరారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు సూచనల మేరకు తాను పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ రోజా శర్మ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణశర్మ, మాజీ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు సోమిరెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మల్లయ్య, బీఆర్‌ఎస్ సిద్దిపేట టౌన్ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సంగు పురేందర్, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ రాగుల సారయ్య, నాయని జైపాల్‌రెడ్డి, సహకార సంఘం చైర్మన్ కోల రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

అమలుకాని హామీలతో అధికారంలోకొచ్చిన కాంగ్రెస్: పద్మారెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఏప్రిల్ 24: ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయకుండా ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థిగా వెంకట్రామారెడ్డి బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు నామినేషన్ పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ పదేళ్ల పాలనలో మాజీ సీఎం కేసీఆర్ ప్రజలతో మమేకమై పనిచేశారని గుర్తుచేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఇబ్బందులు ఎదురైనా.. ప్రజలు పార్లమెంట్ ఎన్నికల్లో కేసీఆర్‌ను గుర్తుచేసుకోబోతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వందరోజులైనా అమలుచేయక విఫలమైందని విమర్శించారు. కాంగ్రెస్‌కు ఈ ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పబోతున్నట్లు తెలిపారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా.. పంటను కూడా కొనుగోలు చేయలేదన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ కాళేశ్వరానికి జాతీయ హోదా కల్పించలేని విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అనంతరం వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ 11 ఏళ్లుగా మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి ప్రజలకు చేరువయ్యానని.. ప్రజలకు మరింత సేవచేసేందుకే పార్లమెంట్ అభ్యర్థిగా మీముందుకు రావడం జరిగిందన్నారు. బుధవారం రెండు సెట్ల నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేసినట్లు తెలిపారు. కాంగ్రెస్ తప్పుడు హామీలతో అధికారంలోకి వచ్చిందన్నారు. బాండ్ పేపర్ అంటే విలువ లేకుండా కాంగ్రెస్ చేసిందని విమర్శించారు. అభ్యర్థుల గుణగణాలను చూసి ప్రజలు ఓటేయాల్సిందిగా పిలుపునిచ్చారు. దుబ్బాక అసెంబ్లీ ఎన్నికల్లో చెల్లని నాణెం.. ఎంపీ ఎన్నికల్లో ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలే అమలు చేయకపోతే ఈ ఎన్నికల్లో ఎలా ఓటు వేస్తారన్నారు. వందరోజుల్లోనే వారి అసలు రంగు బయటపడిందని, ప్రజలు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను గుర్తు చేసుకుంటున్నారని తెలిపారు. ఈ ఎన్నికల్లో తనకు అవకాశమిస్తే అందరికీ సేవకుడిగా ఉంటానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు సునితారెడ్డి, చింతా ప్రభాకర్, మహిపాల్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ హేమలతాశేఖర్‌గౌడ్, ఫారూఖ్‌హుస్సేన్, బట్టి జగపతి పాల్గొన్నారు.

డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

● ఆరుగురిపై హత్యాయత్నం కేసు

కంది, ఏప్రిల్ 24: కంది మండలంలోని ఇంద్రకరణ్‌లో డ్రగ్ ఇన్‌స్పెక్టర్‌పై దాడిచేసిన సంఘటనలో బుధవారం ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. ఇంద్రకరణ్ గ్రామంలోని గణేష్ ప్రథమ చికిత్సా కేంద్రంలో అనుమతి లేకుండా మందులను విక్రయిస్తున్నారని నమ్మదగిన సమాచారంతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ మద్దెల చంద్రశేఖర్ సహోద్యోగి రవికిరణ్‌రెడ్డి, గ్రామపంచాయతీ సిబ్బంది బాల్‌రాజ్, దుర్గయ్యతో కలిసి సోదాలు చేసి.. అనుమతులు లేకుండా 45 రకాల మందులు నిల్వ ఉంచినట్లు గుర్తించారు. ఈ మేరకు పంచనామా నిర్వహిస్తుండగా ప్రథమ చికిత్సా కేంద్రం యజమాని కట్టా రవి, చెంద్రి శ్రీనివాస్, మల్లేశం, శామ్యూల్, జొన్నాడ జైపాల్, శంకరీశ్వర్ కలిసి డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్‌ను దుర్భాషలాడుతూ దాడికి పాల్పడ్డారని ఎస్‌ఐ వివరించారు. దాడికి పాల్పడిన ఆరుగురిపై హత్యాయత్నం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పోలీసుల తనిఖీల్లో రూ.1.30 లక్షలు పట్టివేత



నగదును స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

గజ్వేల్/వర్గల్, ఏప్రిల్ 24: వర్గల్ మండలం గౌరారంలో రూ.70 వేలు, కొమురవెల్లి మండలం రసూలాబాద్ గ్రామ శివారులో రూ.60 వేల నగదును పోలీసులు బుధవారం పట్టుకున్నారు. గౌరారం ఎస్‌ఐ శివకుమార్ తన సిబ్బందితో గౌరారం గ్రామంలోని వర్గల్ కమాన్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీల్లో గజ్వేల్ పట్టణానికి చెందిన మహ్మద్ నబీ తన బొలెరో వాహనంలో ఎలాంటి ఆధారాలు లేకుండా తీసుకెళ్తున్న రూ.70 వేలను సీజ్‌చేసినట్లు తెలిపారు. అలాగే కొమురవెల్లి మండలం రసూలాబాద్ గ్రామ శివారులో ఎస్‌ఐ నాగరాజు ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలో కిష్టంపేట గ్రామానికి చెందిన శ్రీకాంత్‌రెడ్డి తన కారులో ఎలాంటి ఆధారాలు లేకుండా రూ.60 వేలు తీసుకెళ్తుండగా పట్టుకుని సీజ్ చేసినట్లు తెలిపారు.

హెచ్ఐవీ నిర్ధారణ కేంద్రాలను సందర్శించిన 'న్యాకో' బృందం



సంగారెడ్డి జీజీహెచ్‌లో న్యాకో బృందం

సంగారెడ్డి అర్బన్, ఏప్రిల్ 24: సంగారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రిలోని హెచ్ఐవీ నిర్ధారణ కేంద్రాలను నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(న్యాకో) బృందం బుధవారం సందర్శించింది. న్యూ ఢిల్లీ నుంచి విచ్చేసిన న్యాకో డిప్యూటీ డైరెక్టర్ భవానీసింగ్‌తో పాటు ఇతర సభ్యులు ఆస్పత్రిలోని ఏఆర్‌టీ సెంటర్, ఐసీటీసీ, ఐసీటీసీ ల్యాబ్‌లతో పాటు కౌన్సిలింగ్ కేంద్రాలను సందర్శించి పలు రికార్డులు పరిశీలించి సిబ్బందితో మాట్లాడారు. హెచ్ఐవీ, ఎయిడ్స్ రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, మందుల లభ్యత, నిర్ధారణ పరీక్షలపై ఆరాతీశారు. అనంతరం ఆస్పత్రి సూపరింటెండెంట్ డా.అనిల్‌కుమార్ ఛాంబర్‌లో సమావేశమైన బృందం వివిధ అంశాలపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు, డాక్టర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించడమే సామాజిక శక్తుల లక్ష్యం

● హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్



మహనీయుల జనజాతర జిల్లా సదస్సులో పూలే, అంబేడ్కర్ చిత్రపటాలకు నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నేతలు

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 24: కార్మిక, రైతు, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీని పార్లమెంట్ ఎన్నికల్లో ఓడించడమే సామాజిక శక్తుల లక్ష్యం కావాలని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి చంద్రకుమార్ అన్నారు. సంగారెడ్డిలోని అంబేడ్కర్ భవన్‌లో బుధవారం రాత్రి నిర్వహించిన మహనీయుల జనజాతర జిల్లా సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2024 ఎన్నికలు మనుస్మృతి శక్తులు, రాజ్యాంగ శక్తులకు మధ్యే ప్రధాన పోటీ ఉన్నదన్నారు. మనస్మృతి వారసులుగా ఉన్న బీజేపీని ఓడించి రాజ్యాంగాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ పదేళ్ల పాలనలో దళితులపై దాడులు పెరిగాయని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళిత మహిళలకు రక్షణ కరువైందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటుపరం చేసి రిజర్వేషన్లు లేకుండా చేయాలని బీజేపీ కుట్ర పన్నుతోందని చెప్పారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం పనికిరాదని ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీలు పలుమార్లు ప్రకటించాయని గుర్తుచేశారు. స్విస్ బ్యాంకుల్లో ఉన్న నల్లధనాన్ని తెప్పించి ప్రతి పౌరుడికి రూ.15 లక్షలు వేస్తామని ఇచ్చిన హామీని పదేళ్ల పాలనలో ఎందుకు అమలు చేయలేదో ప్రధాని చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ దళితులు ఏ పార్టీలో ఉన్నా బీజేపీకి ఓటు వేయాలని మందకృష్ణ మాదిగ ఎందుకు చెప్పారో తెలపాలన్నారు. బీజేపీ 400 ఎంపీ సీట్లు గెలుస్తామని మైండ్‌గేమ్ ఆడుతున్నదన్నారు. నార్త్ ఇండియాలో బీజేపీకి ఎదురు గాలి వీస్తున్నదని చెప్పారు. ఇండియా కూటమి ఐక్యంగా ముందుకు సాగుతున్నదని ఓటమి భయంతోనే బీజేపీ మూడు రాష్ట్రాల్లో ఎంపీ సీట్లకు పోటీలో నిలపలేదని అన్నారు. బీజేపీని ఓడించడమే లౌకికవాద శక్తుల కర్తవ్యంగా భావించాలని పిలుపునిచ్చారు. కేవీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాణిక్యం, జిల్లా కార్యదర్శి అశోక్, కేజీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌గౌడ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ.సాయిలు, వివిధ ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఒరగబెట్టిందేమీ లేదు

● మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు

● కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధు నామినేషన్



నామినేషన్ వేయడానికి ర్యాలీగా బయలుదేరుతున్న నీలం మధు

మెదక్, ఏప్రిల్ 24: గత 25 ఏళ్లుగా ఇక్కడి నుంచి ప్రాతినిథ్యం వహించిన బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకులు ఈ ప్రాంతానికి ఒరగబెట్టింది ఏమీ లేదని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. బుధవారం కాంగ్రెస్ మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధుముదిరాజ్ నామినేషన్ దాఖలు చేశారు. కాగా మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, ఆవుల రాజిరెడ్డి, మదన్‌రెడ్డి, మెదక్ డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్, సుహాసిని మెదక్ పట్టణానికి చేరుకున్నారు. సర్వమత ప్రార్థనల తర్వాత మెదక్ కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా ఎన్నికల అధికారి, మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా మైనంపల్లి మాట్లాడుతూ మెదక్ ఎంపీగా నీలం మధుముదిరాజ్ భారీ మెజారిటీతో గెలుస్తాడని ధీమా వ్యక్తం చేశారు. మెదక్ పార్లమెంట్ నుంచి ప్రాతినిథ్యం వహించిన మహానేత స్వర్గీయ ఇందిరాగాంధీ హయాంలోనే అభివృద్ధి జరిగిందన్నారు. అనంతరం మధు మాట్లాడుతూ సర్వమతాల నమ్మకాలను గౌరవించే ఏకైక పార్టీ కాంగ్రెస్ మాత్రమేనన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి తార్కాణంగా కాంగ్రెస్ పాలన కొనసాగుతున్నదని చెప్పారు. ఇందిరమ్మ ప్రాతినిథ్యం వహించిన మెదక్ పార్లమెంట్ స్థానం నుంచి బీసీ బిడ్డనైనా తనకు కాంగ్రెస్ అవకాశం కల్పించిందన్నారు. మెదక్ పార్లమెంట్ ఓటర్లంతా పెద్ద మనసు చేసుకుని మీ ఇంటి బిడ్డనైనా తనను గెలిపిస్తే అన్నివర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తానని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో సుహాసిని, మెదక్ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ చైర్మన్ సుదర్శన్‌గౌడ్ పాల్గొన్నారు.

రైలు ఢీకొని యువతి మృతి



రమ్య(ఫైల్)

రామాయంపేట, ఏప్రిల్ 24: ప్రమాదవశాత్తు రైలు ఢీకొని యువతి మృతిచెందిన సంఘటన నార్సింగి మండల శివారులో చోటు చేసుకున్నది. మండల పరిధిలోని శేరిపల్లి గ్రామానికి చెందిన పంబాల రమ్య(18) బుధవారం మధ్యాహ్నం తన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి వస్తున్న క్రమంలో కామారెడ్డి వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందింది. విషయం తెలుసుకున్న కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావునాయక్ ఘటనా స్థలానికి చేరుకుని, పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



తీవ్రగాయపాలైన బీరయ్య

వెల్దుర్తి, ఏప్రిల్ 24: ద్విచక్ర వాహనం అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. మండల పరిధిలోని దామరంచ గ్రామానికి చెందిన ఈర బీరయ్య తూప్రాన్ నుంచి వెల్దుర్తి వైపు వెళ్తున్నాడు. ఈ క్రమంలో వెల్దుర్తి గ్రామ శివారులోని గంగమ్మ ఆలయం వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతడిని 108 అంబులెన్స్‌లో తూప్రాన్ ప్రభుత్వాస్పత్రికి.. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

'గీతం'లో ఆర్బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ చేస్తున్న దువ్వూరి సుబ్బారావు

పటాన్‌చెరు రూరల్, ఏప్రిల్ 24: గీతం యూనివర్సిటీ అట్టహాసంగా నిర్వహిస్తున్న కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ కార్యక్రమంలో బుధవారం భారతీయ రిజర్వు బ్యాంకు మాజీ గవర్నర్, కౌటిల్యాలోని విశిష్ట విజిటింగ్ ప్రొఫెసర్ డాక్టర్ దువ్వూరి సుబ్బారావు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. సుబ్బారావు 'జస్ట్ ఏ మెర్సెనరీ? నోట్స్ ఫ్రమ్ మై లైఫ్ అండ్ కెరీర్' పేరుతో ఆంగ్లంలో పుస్తకాన్ని రచించారు. ఐదేళ్ల (2008-13) పాటు భారతీయ రిజర్వు బ్యాంకు గవర్నర్‌గా పనిచేశారు. అంతకుముందు, ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి (2005-07), భారత ప్రభుత్వ ఆర్థిక కార్యదర్శిగా (2007-08), కార్యదర్శి వంటి గౌరవనీయమైన పదవులను నిర్వహించారు. ఈ పుస్తకం డాక్టర్ సుబ్బారావు అసాధారణ కెరీర్‌కు సంబంధించిన ఆకర్షణీయమైన, శ్రద్ధాసక్తులతో కూడిన కథనాన్ని అందించడమేగాక, యువ నిపుణులకు వారి సొంత వృత్తిలో రాణించడానికి మార్గనిర్దేశనం చేసేలా, యువతను ప్రేరేపించేలా ఉన్నది. వివిధశాఖలలో పలు హోదాల్లో ఆయన చేసిన సుదీర్ఘ ప్రయాణం నుంచి పాఠాలు నేర్చుకోవడంతో పాటు ప్రారంభ జిల్లాస్థాయి నియామకాల నుంచి భారతదేశ బ్యూరోక్రాటిక్ ఫ్రేమ్ వర్క్ వరకు జరిగిన పరిణామ క్రమం, పౌర సేవల్లో లింగ సమానత్వం వంటి పలు ఆసక్తికర అంశాలను సృజిస్తూ సాగింది. చివరగా, తన తల్లికి రాసిన లేఖను ఈ పుస్తకంలో అచ్చు వేయడంతో పాటు, దానిని డాక్టర్ సుబ్బారావు స్వయంగా చదివి వినిపించడం అందరినీ కదిలింపజేసింది. రచయిత డాక్టర్ సుబ్బారావుతో సంభాషణను కౌటిల్యాలోని విజిటింగ్ ఫ్యాకల్టీ, ఇండిపెండెంట్, మల్టీమీడియా జర్నలిస్టు స్మితాశర్మ నేర్పుగా నిర్వహించగా, కౌటిల్యా ప్రోగ్రామ్ మేనేజర్ శివంగిశర్మ వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ డీన్ సయ్యద్ అక్బరుద్దీన్, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ సుబ్బారావును అడిగి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

హత్య కేసులో ఇరువురి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ రవి

జహీరాబాద్, ఏప్రిల్ 24: ఆటోకు సంబంధించిన అద్దె డబ్బులు ఇవ్వమన్నందుకు ఓ వ్యక్తిని హత్య చేసిన ఇద్దరిని బుధవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచామని జహీరాబాద్ పట్టణ సీఐ రాజబోయిన రవి తెలిపారు. బుధవారం పట్టణంలోని సీఐ కార్యాలయంలో నిందితుల వివరాలను వెల్లడించారు. హైదరాబాద్‌లోని ఎల్లమ్మబండకు చెందిన షేక్ అన్వర్‌అలీ అలియాస్ హనిసింగ్, ముస్తకీం(రాజనెల్లి-కోహీర్), మహ్మద్‌కైఫ్(గురుజువాడ-కోహీర్)లకు అద్దె ప్రాతిపదికన ఆటోను ఇచ్చాడు. అద్దె డబ్బులు చెల్లించాలని షేక్ అన్వర్‌అలీ తరచూ ఫోన్ చేయడంతో విసుగు చెంది హత్య చేశారని సీఐ తెలిపారు. ఈ మేరకు వారిని అరెస్టు చేసి కోర్టులో హాజరిపరిచామని వివరించారు. ఈ కార్యక్రమంలో కోహీర్ ఎస్‌ఐ విఠల్, పోలీసులు పాల్గొన్నారు.


పాలిసెట్ అర్హత పరీక్షకు దరఖాస్తుల ఆహ్వానం

సంగారెడ్డి రూరల్, ఏప్రిల్ 24: పాలిటెక్నిక్ విద్యనభ్యసించేందుకు ఆసక్తిగల విద్యార్థులు పాలిసెట్ అర్హత పరీక్షకు దరఖాస్తులు చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులు చేసుకునేందుకు ఈ నెల 28వ తేదీవరకు చివరి గడువని, మే 24న అర్హత పరీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. పరీక్షకు దరఖాస్తు రుసుం ఎస్సీ, ఎస్టీలకు రూ.250, బీసీ, మైనార్టీ ఇతరులు రూ.500 చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతి

మాసాయిపేట, ఏప్రిల్ 24: ఆర్టీసీ బస్సు ఢీకొని మహిళ మృతిచెందింది. సికింద్రాబాద్‌లోని రాచబొల్లారంకు చెందిన బిక్నీ(36) అనే మహిళ మాసాయిపేట మండలం చెట్ల తిమ్మాయిపల్లి గ్రామంలోని బంధువుల పెళ్లికి వచ్చింది. కాగా బుధవారం రాత్రి చెట్ల తిమ్మాయిపల్లి చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ ఢీకొన్నది. ఈ ఘటనలో బిక్నీ అక్కడికక్కడే మృతిచెందింది. కాగా ఆమె శరీరం రెండు ముక్కలైంది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు.

రంగంపేటలో పారిశుధ్య కార్మికుడి మృతి



దాసు(ఫైల్)

కొల్చారం, ఏప్రిల్ 24: మ్యాన్‌హోల్ శుభ్రం చేస్తుండగా అస్వస్థతకు గురైన పారిశుధ్య కార్మికుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. కొల్చారం మండలం రంగంపేట గ్రామానికి చెందిన పారిశుధ్య కార్మికుడు మాదిగ దాసు బుధవారం సాయంత్రం బస్టాండ్ సమీపంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉన్న అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్‌లో శుభ్రం చేస్తుండగా.. అందులో జారిపడి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. చికిత్సం నిమిత్తం మెదక్ జిల్లా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. మృతుడికి భార్య, వృద్ధురాలైన తల్లి ఉన్నది. దాసు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

బావిలో పడి మతిస్థిమితం లేని వృద్ధురాలి మృతి

హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 24: బావిలో పడి మతిస్థిమితం లేని వృద్ధురాలు మృతిచెందింది. ఎస్‌ఐ తోట మహేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామానికి చెందిన యామ రాజవ్వ(70) ఈనెల 21న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లింది. కుటుంబసభ్యులు మాత్రం ఆమె కూతురు ఇంటికి వెళ్లిందని భావించారు. బుధవారం వ్యవసాయ బావి నుంచి దాని యజమానికి దుర్వాసన వస్తుండడంతో వచ్చి చూడగా మృతదేహం కనిపించిందని చెప్పారు. మృతురాలి మనుమడు యామ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

బొడ్రాయికి జలాభిషేకం



బొడ్రాయికి జలాభిషేకాలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

మద్దూరు, ఏప్రిల్ 24: మద్దూరు మండలంలోని లద్నూరు గ్రామంలో నిర్వహిస్తున్న బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాల్లో భాగంగా బుధవారం బొడ్రాయికి గ్రామస్థులు జలకడువలతో జలాభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భూలక్ష్మి, మహాలక్ష్మి సమేత నాభిశిలను గ్రామంలోని ట్రాక్టర్‌లో ఊరేగింపు చేపట్టగా.. గ్రామస్థులు పెద్దఎత్తున జలాభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం పోచమ్మకు భక్తిశ్రద్ధలతో బోనాలు తీసుకెళ్లి నైవేద్యం సమర్పించారు.

అట్టహాసంగా భేతాళుడి జాతర ప్రారంభం



వరిగుంతంలో పెద్దమ్మతల్లి ఉత్సవాల్లో గణపతి పూజ చేస్తున్న ముదిరాజ్‌లు



అల్లాదుర్గంలోని భేతాళస్వామి జాతరలో భాగంగా పోలేరమ్మ దేవతకు రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

అల్లాదుర్గం, ఏప్రిల్ 24: ఎంతో ప్రసిద్ధిచెందిన అల్లాదుర్గంలోని భేతాళ స్వామి జాతర బుధవారం అట్టహాసంగా ప్రారంభమైంది. ఇందులో భాగంగా పోలేరమ్మకు బోనాలు, రథోత్సవం నిర్వహించారు. రంగురంగుల పూలతో అలంకరించిన రథాన్ని గ్రామంలోని పురవీధుల గుండా ఊరేగింపుగా ఆలయం వద్దకు తీసుకెళ్లారు. అనంతరం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి, మొక్కులను తీర్చుకున్నారు.

వరిగుంతంలో పెద్దమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన

కొల్చారం, ఏప్రిల్ 24: కొల్చారం మండల పరిధిలోని వరిగుంతంలో నిర్మించిన పెద్దమ్మతల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠానోత్సవాలు బుధవారం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి. గ్రామ ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఆలయాన్ని నిర్మించారు. కాగా విగ్రహ ప్రతిష్ఠాపన పురోహితుడు పుల్వాకుల రావికోటి సాంబశివశర్మ చేతులమీదుగా ముదిరాజ్ సోదరులు గణపతి, గౌరి పూజ, పుణ్యాహవచనం, యోగిని, వాస్తు, క్షేత్ర పాలన పూజలు నిర్వహించారు.

తుల్జారాంపేటలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

నర్సాపూర్, ఏప్రిల్ 24: నర్సాపూర్ మండలం తుల్జారాంపేట గ్రామంలో బుధవారం జగదాంబ అమ్మవారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. గిరిజనుల ఆరాధ్యదైవమైన జగదాం అమ్మవారికి గిరిజనులు సంప్రదాయం ప్రకారం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు వి.మల్లేశ్‌గౌడ్, రాములనాయక్ పాల్గొన్నారు.

తూప్రాన్‌లో రాములోరి రథోత్సవం

తూప్రాన్, ఏప్రిల్ 24: తూప్రాన్ పట్టణ శివారులోని పురాతన శ్రీరామాలయ వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రథోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద హోమం నిర్వహించగా, మున్సిపల్ చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ పాల్గొన్నారు. అనంతరం సీతారామచంద్రస్వాములను రథోత్సవం మీదకు చేర్చారు. అనంతరం స్వామివారికి చక్రస్నానం నిర్వహించారు.

ఘనంగా సిద్ధేశ్వర రథోత్సవం

కంగ్టి, ఏప్రిల్ 24: మండల కేంద్రమైన కంగ్టిలో సిద్ధేశ్వరుడి జాతరలో భాగంగా బుధవారం స్వామివారికి శిరోత్సవం నిర్వహించారు. ప్రత్యేక వెదురు కర్రలతో తయారు చేసిన శిఖరాన్ని భక్తులు డప్పువాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించి, శివనామస్మరణ మధ్య రథంపైకి ఎక్కించారు.

కార్మికుల ఆరోగ్యానికి పెద్దపీట

● గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ బస్‌డిపోలో కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

గజ్వేల్, ఏప్రిల్ 24: కార్మికుల ఆరోగ్యానికి టీఎస్ఆర్టీసీ పెద్దపీట వేస్తుందని గజ్వేల్-ప్రజ్ఞాపూర్ డిపో మేనేజర్ బి.సురేఖ పేర్కొన్నారు. గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ బస్‌డిపోలో ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్ 2.0 కార్యక్రమాన్ని బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమం డిపోలో ఈ నెల 27వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మొదటి రోజు 93మంది డ్రైవర్లు, కండక్టర్లకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. ఆమె వెంట సీఐ బాబునాయక్, హెల్త్ వాలంటరీ స్వాతి, సంపత్, డీఐ కేఎం రెడ్డి, సెఫ్టీ వార్డెన్ నర్సింహులు, డిపో సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన మిట్టపల్లి మహిళలు

సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 24 : కాంగ్రెస్ పార్టీ విధి విధానాలు నచ్చి అభిమానంతో పార్టీలో చేరుతున్నవారికి పార్టీ స్వాగతం పలుకుతుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. బుధవారం సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన మహిళలు కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. కాంగ్రెస్ రాష్ట్రానికి సురక్షిత పాలన అందిస్తుందన్నారు. కార్యక్రమంలో మహిళా జిల్లా అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి, కవిత, నాయకులు సతీష్ గౌడ్, వహీద్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

● బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు

గజ్వేల్/వర్గల్, ఏప్రిల్ 24: మెదక్ పార్లమెంట్‌పై బీజేపీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు పిలుపునిచ్చారు. వర్గల్ మండల బీజేపీ అధ్యక్షుడిగా ఎన్నికైన టేకులపల్లి బాల్‌రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా రఘునందన్‌రావు మాట్లాడుతూ దేశంలో మూడోసారి మోదీని ప్రధానిగా చేసేందుకు, మెదక్ పార్లమెంట్‌ను బీజేపీ గెలుచుకునేందుకు ప్రతీ కార్యకర్త పనిచేయాలని కోరారు. వర్గల్ మండలంలో పార్టీ కార్యకర్తలు, నాయకులను సమన్వయం చేసుకుని పార్టీ అభివృద్ధి కృషి చేయాలని సూచించారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి, నాయకులు నందన్‌గౌడ్, వెంకట్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, కమ్మరి శ్రీనివాస్, కుడిక్యాల రాములు ఉన్నారు.



రఘునందన్‌రావును సన్మానిస్తున్న వర్గల్ మండల నాయకులు

నాగపురిలో ఘనంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



నాగపురిలో బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకల్లో ఎమ్మెల్యే పల్లారాజేశ్వర్‌రెడ్డి పూజలు

చేర్యాల, ఏప్రిల్ 24: మండలంలోని నాగపురి గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠాపనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శీతలాదేవి నాభి ప్రతిష్ఠ, యంత్ర ప్రతిష్ఠ వేడుకల్లో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. చేర్యాల ప్రాంతం సుభిక్షంగా ఉండాలని వేడుకున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. అంతకు ముందు పట్టణంలో పలు వివాహ శుభకార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉల్లంపల్లి కరుణాకర్, మాజీ సర్పంచ్ బండమీది సంతోషి కరుణాకర్, మండల అధ్యక్షుడు అనంతుల మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

సివిల్ ర్యాంకర్ అఖిల్‌కు సత్కారం



అఖిల్‌ను అభినందిస్తున్న కాలనీవాసులు

కొండపాక, ఏప్రిల్ 24: మండలకేంద్రానికి చెందిన బుద్ధి అఖిల్ ఐఏఎస్ లో ర్యాంకు సాధించడంతో కాంత్రినగర్ కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు. తమ గ్రామానికి చెందిన యువకుడు కలెక్టర్ కాబోతున్నాడని, ఇది గ్రామానికే గర్వకారణమని గ్రామస్థులు తెలిపారు. డిల్లీ నుంచి వచ్చిన అఖిల్‌ను క్రాంతినగర్‌లోని ఆయన నివాసంలో బుధవారం కాలనీవాసులు కలిసి ఘనంగా సత్కరించారు.

నియోజకవర్గంలో కాంగ్రెస్ బలోపేతానికి కృషి



కాంగ్రెస్ పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న నర్సారెడ్డి

గజ్వేల్, ఏప్రిల్ 24: గజ్వేల్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తామని సిద్దిపేట జిల్లా కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్‌లోని ఆయన నివాసంలో గజ్వేల్ మండలం జాలిగామ మాజీ ఎంపీటీసీ అంజనేయులుగౌడ్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు గంగిశెట్టి రాజు, నంగునూరి సత్యనారాయణ, మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ షరీఫ్, నాయకులు గుంటుకు శ్రీనివాస్, నక్క రేగొండ, ఏడెల్లి శ్రీనివాస్, మల్యాల భద్రయ్య, మోచీ ప్రభాకర్ తదితరులు గాడిపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో నర్సారెడ్డి సమక్షంలో బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీకి కంచుకోట అని, మరోసారి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ నాయకులు నాయిని యాదగిరి, మండలాధ్యక్షుడు మల్లారెడ్డి, పట్టణాధ్యక్షుడు మోహన్నగారి రాజు, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, సయ్యద్ మతీన్, సర్దార్‌ఖాన్, శివరాంరెడ్డి, ఎక్బాల్, అజీజ్, జగ్గయ్యగారి శేఖర్‌గుప్తా, యాదగిరి, తఖీ, నక్కరాములుగౌడ్ ఉన్నారు.

ప్రజాపాలనలో అందరూ భాగస్వాములు కావాలి

ములుగు, ఏప్రిల్ 24: కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజాపాలనలో అందరూ భాగస్వాములు కావాలని డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డి అన్నారు. బుధవారం ములుగు మండలం అచ్చాయపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు జిల్లా పరిషత్ సభ్యులు సయ్యద్ సలీం అధ్యక్షతన నర్సారెడ్డి సమక్షంలో కాగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో గజ్వేల్ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థి నీలం మధుకు భారీ మెజార్టీ అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు.

యథేచ్ఛగా కలప అక్రమ వ్యాపారం



మల్కాపూర్ శివారులో నేలకొరిగిన చెట్లు

టేక్మాల్, ఏప్రిల్ 24: మండలంలో అక్రమంగా చెట్లను నరికి, కలప వ్యాపారం సాగుతున్నా అటవీ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదు. విషయం తెలిసినా అటువైపే కన్నెత్తి చూడకుండా మామూళ్ల మత్తులో మునిగి తెలుతున్నారని పలువురు బహిరంగంగా చర్చించుకుంటున్నారు. మూడు రోజుల నుంచి మండలంలోని మల్కాపూర్ గ్రామ శివారులో వేప, సుబాబులు, తుమ్మ, చింతచెట్లను కలప వ్యాపారులు పదుల సంఖ్యలో నేలమట్టం చేశారు. సెలవు దినాల్లో తాము రామని, ఎన్ని చెట్లైనా కొట్టుకోమని అటవీశాఖ సిబ్బంది సదరు వ్యాపారికి భరోసా ఇచ్చినట్లు సమాచారం. దీంతో కలప వ్యాపారం జోరుగా సాగుతోందని ప్రజలు చర్చించుకుంటున్నారు. అటవీశాఖ సిబ్బంది స్నేహసంబంధాలు కొనసాగిస్తూ తూతూ మంత్రంగా జరిమానాలు విధిస్తుండడంతోనే వ్యాపారులు విచ్చలవిడిగా చెట్లను నరికేస్తున్నట్లు ఆరోపణలు వివిపిస్తున్నాయి. చెట్ల నరికివేతను అటవీ శాఖ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సమాజసేవకు అంకితమైన సత్యసాయి



సత్యసాయి చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత, సేవాసమితి సభ్యులు

హుస్నాబాద్ టౌన్, ఏప్రిల్ 24: సమాజ సేవ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు భగవాన్ సత్యసాయి బాబా అని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. బుధవారం హుస్నాబాద్ పట్టణంలోని గాంధీ చౌరస్తాలో సత్యసాయి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి భక్తులతో పాటు ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేద ప్రజలకు మంచినీటిని అందించి దాహార్తిని తీర్చాడని, ఉచిత విద్య, వైద్యం వంటి అనేక సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల హృదయాల్లో నిలిచిపోయారన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ దొడ్డి శ్రీనివాస్, సత్యసాయి సేవాసమితి సభ్యులు మురికి సంధ్యావళి, దొడ్డి లక్ష్మీ, కొత్తపల్లి రవీందర్, స్వరూప, జ్యోతి, చంద్రకళ, జయ, నాగరాణి, రాణి, యాదగిరి రెడ్డి, ఉమారాణి, భవాని, శోభ తదితరులున్నారు.

గజ్వేల్‌లో ఘనంగా సత్యసాయి ఆరాధన

గజ్వేల్, ఏప్రిల్ 24: శ్రీసత్యసాయిబాబ ఆరాధన మహోత్సవాన్ని గజ్వేల్ పట్టణంలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గజ్వేల్ పట్టణంలోని బస్టాండ్‌లో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యసాయి సేవాసమితి సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ భగవాన్ సత్యసాయి మార్గాన్ని తాము ఆచరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సేవాసమితి సభ్యుడు వెంకటనర్సింహరెడ్డి, సభ్యులు వెంకటేశం, నర్సింగరావు, గిరిధర్, సాయిప్రసాద్, లింగం, బాలకిషన్, మల్లేశం, కృష్ణమూర్తి, మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

డ్రాపవుట్ విద్యార్థినికి ఒకేషనల్ ఫస్టియర్‌లో అత్యుత్తమ మార్కులు



సాయిదీప్తి

చేర్యాల, ఏప్రిల్ 24 : చేర్యాల మండలం కస్తూర్బా బాలికల గాంధీ పాఠశాలలో ఇంటర్ ఫస్టియర్ ఒకేషనల్ ఫలితాల్లో రెండేళ్ల పాటు చదువుకు దూరమైన డ్రాపవుట్ విద్యార్థిని సాయిదీప్తి 492/500 మార్కులు సాధించి జిల్లాస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించారు. హైదరాబాద్‌లోని నాగారం ప్రాంతానికి చెందిన సాయిదీప్తి నాగారంలోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో 2020-21 బ్యాచ్ పదోతరగతిలో ఉత్తీర్ణత సాధించింది. అనంతరం ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏడాదిపాటు ఇంట్లో తల్లి దండ్రులవద్దే ఉంటూ చదువుకు దూరమైంది. బంధువుల సలహాలు, సూచనలతో 2022లో సిద్దిపేట జిల్లా మిట్టపల్లి కస్తూర్బా విద్యాలయంలో ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్ తీసుకున్నప్పటికీ కుటుంబ పరిస్థితుల కారణంగా చదువును కొనసాగించలేకపోయింది. అనంతరం 2023లో చేర్యాలలోని కస్తూర్బాలో తిరిగి ఇంటర్ ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫస్టియర్ ఒకేషనల్ కోర్సులో అడ్మిషన్ తీసుకున్న సాయిదీప్తి సిద్దిపేట జిల్లాస్థాయిలో అత్యుత్తమ మార్కులు సాధించింది. రెండేళ్ల పాటు చదువుకు దూరమై ఫస్టియర్‌లో ప్రతిభ కనబరచడం పట్ల ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు. కాగా ఇదే గురుకులానికి చెందిన విద్యార్థిని వైశాలి ఫస్టియర్‌లో 476/500 సాధించింది., సెకండియర్‌లో ఎంపీహెచ్‌ఎన్‌లో బిప కవిత 926/1000 ఎస్. పూజ 920/ 1000 మార్కులు సాధించారు.

ఒకేషనల్ సెకండియర్‌లో సుకుమార్ ప్రతిభ

దుబ్బాక/మిరుదొడ్డి, ఏప్రిల్24: దుబ్బాక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ రెండవ సంవత్సరం (ఒకేషనల్ ఈటీ) చదువుతున్న డి సుకుమార్‌కు వెయ్యి మార్కులకు గానూ 994మార్కుల్ సాధించారు. మిరుదొడ్డి మండలంలో ద్వితీయ సంవత్సరంలో 73శాతం, ప్రథమసంవత్సరంలో 57శాతం ఉత్తీర్ణత సాధించారు.

బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేద్దాం



గజ్వేల్‌లో యువచౌపాల్ కార్యక్రమంలో మాట్లాడుతున్న అంజనేయులుగౌడ్

గజ్వేల్, ఏప్రిల్ 24: మెదక్ పార్లమెంట్ బీజేపీ అభ్యర్థి గెలుపునకు కృషిచేద్దామని బీజేవైఎం రాష్ట్ర ప్రోగ్రాం కోఆర్డినేటర్ నేమూరి అంజనేయులుగౌడ్ పిలుపునిచ్చారు. గజ్వేల్‌లో యువ చౌపాల్ పేరిట బీజేవైఎం పట్టణాధ్యక్షుడు మెతుకు కరుణాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి పట్టణ బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌యాదవ్‌తో కలసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ చేపట్టిన పథకాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలన్నారు. మెదక్ పార్లమెంట్ బరిలో నిలిచిన రఘునందన్‌రావును గెలిపించాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట బీజేవైఎం సిద్దిపేట జిల్లా కోశాధికారి అర్కేయాదవ్, బీజేవైఎం ఉపాధ్యక్షుడు శ్రీరాం నగేశ్, శీర్ల స్వామి, బీజేవైఎం పట్టణ ప్రధాన కార్యదర్శి మధుగారి శివ, నాయకులు ఉన్నారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్



శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేస్తున్న వర్కింగ్ ప్రెసిడెంట్

ములుగు, ఏప్రిల్ 24: ములుగు మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా ములుగు మండలం మామిడాల గ్రామానికి చెందిన తమ్మలి శ్రీనివాస్ నియామకమయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి చేతుల మీదుగా బుధవారం హైదరాబాద్‌లోని నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా రెండోసారి అవకాశం కల్పించినందుకు డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

గ్రామాల అభివృద్ధికి కృషి: దుబ్బాక ఎమ్మెల్యే

గజ్వేల్, ఏప్రిల్ 24: గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తానని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గజ్వేల్ మండలం చిన్నఆరేపల్లి గ్రామంలో బొడ్రాయి వేడుకల్లో బుధవారం ఆయన పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలోని గ్రామాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా తాను పనిచేస్తున్నట్టు తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజాసేవకు అంకితమవుతానని, తనను గెలిపించిన దుబ్బాక ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. ఆయనవెంట రాయపోల్ మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వర శర్మ, నాయకులు తదితరులున్నారు.



గజ్వేల్: చిన్నఆరేపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి

ధర్మాజీపేటలో రేణుకాదేవి కల్యాణోత్సవం

దుబ్బాక, ఏప్రిల్24: దుబ్బాక మున్సిపల్ ధర్మాజీపేట రేణుకాదేవి ఆలయంలో సిద్దియోగం(కల్యాణోత్సవం) బుధవారం ముగిసింది. రెండురోజులుగా సాగుతున్న ఉత్సవాల్లో భాగంగా సోమవారం బోనాల ఊరేగింపు. మంగళవారం రేణుకాదేవి, జమదగ్నిల కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. బుధవారం ఆలయాన్ని దుబ్బాక ఎమ్మెల్యే కొత్తప్రభాకర్‌రెడ్డి, కాంగ్రెస్ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిలు వేర్వేరుగా పూజలు నిర్వహించారు. వారితో కౌన్సిలర్ దుబ్బాక బాలకృష్ణ, మాజీ సర్పంచు వెంకటస్వామిగౌడ్, గౌడసంఘం నాయకులు ఐరేని శివరాజం గౌడ్, దుబ్బాక నారాగౌడ్, రమేష్‌గౌడ్ ఉన్నారు.

గుడికందులలో మాంకాళమ్మ ఉత్సవాలు

తొగుట, ఏప్రిల్ 24: మండలంలోని గుడికందుల గ్రామంలో జరుగుతున్న మాంకాళమ్మ ఉత్సవాల్లో బుధవారం దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామస్థులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాన్గల్ కోఆపరేటివ్ సొసైటీ చైర్మన్ హరికృష్ణరెడ్డి, వైస్ ఎంపీపీ శ్రీకాంత్‌రెడ్డి, మండలపార్టీ అధ్యక్షుడు రాంరెడ్డి, నాయకులు మల్లయ్య, కొమురయ్య, రాంరెడ్డి, కనకయ్య, శ్రీనివాస్, భైరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జిజ్ఞాస-2024 పోటీల్లో సత్తా చాటిన గజ్వేల్ డిగ్రీ కళాశాల విద్యార్థినులు

గజ్వేల్, ఏప్రిల్ 24: గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులు కమిషనర్ ఆఫ్ కాలేజీ ఎట్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్టూడెంట్ స్టడీ ప్రాజెక్ట్ జిజ్ఞాసలో 2024లో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రథమ, తృతీయ బహుమతులను సాధించారు. జిజ్ఞాస ప్రాజెక్టు 2024-పోటీల్లో ఫిజిక్స్ విభాగంలో డాటా ట్రాన్స్‌మిషన్ యూజింగ్ లైఫ్-ఐ అంశంలో డాక్టర్ పి.సౌజన్య పర్యవేక్షణలో విద్యార్థినులు ఏ.సాత్విక(ఎంపీసీఎస్, ఫైనలియర్), పి.మానస(ఎంపీసీఎస్ ఫైనలియర్), పి.పూజ (ఎంపీసీఎస్ ఫైనలియర్), ఆర్.నమిత(ఎంపీసీఎస్ ఫైనలియర్), ఎం.పావని (ఎంపీసీ ఫైనలియర్), డి.సారక్క (ఎంపీసీ ఫైనలియర్) విద్యార్థినులు ప్రథమ బహుమతి గెలుపొందారు. తెలుగు విభాగంలో డాక్టర్ జి.అనిత పర్యవేక్షణలో తెలంగాణ ఉద్యమ సాహిత్యం గద్దర్ ఆట-పాట అనే అంశంలో విద్యార్థినులు పి.నీరజ(బీకాం ఫైనలియర్), ఆర్.నవ్య(ఎంపీసీఎస్ సెకండియర్), జి.స్రవంతి(బీజడ్‌సీ సెకండియర్), జి.కావ్య (బీకాం సెకండియర్), అనూష(బీఎస్సీ సెకండియర్) విద్యార్థినులు తృతీయ బహుమతి గెలుపొందారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ వీవీ ఉమాశశి, అధ్యాపకులు గెలుపొందిన విద్యార్థినులను, పర్యవేక్షకులను అభినందించారు.

రోడ్లపై ప్రమాదకర గుంతల్ని పూడ్చాలి



తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, ఏప్రిల్ 24 : కొమురవెల్లి మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లపై ప్రమాదకరంగా మారిన గుంతలను పూడ్చాలని సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్‌కు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ బీటీ రోడ్డుపై గుంతల్ని పూడ్చడంతో పాటు గురువన్నపేట నుంచి కుకునూర్‌పల్లి వెళ్లే రహదారిని వెంటనే తారు రోడ్డుగా ఏర్పాటు చేయాలని తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందించినట్లు తెలిపారు.

అమ్మ ఆదర్శ పాఠశాలపై అవగాహన

కొల్చారం, ఏప్రిల్ 24: కొల్చారం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం అమ్మ ఆదర్శ పాఠశాలపై అవగాహన కార్యక్రమం ఎంపీడీవో లక్ష్మీనర్సింహులు అధ్యక్షతన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి నీలకంఠం హాజరై పాఠశాల ప్రధానోపాధ్యాయులకు, డ్వాక్రా సంఘాల గ్రామ సంఘాల అధ్యక్షులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఏఈ మహేష్, ఐకెపి ఏపీఎం సుసిల్వ తదితరులు పాల్గొన్నారు.

నవీన్‌కుమార్‌కు నేషనల్ అవార్డు



అవార్డును అందుకుంటున్న నవీన్‌కుమార్

హత్నూర, ఏప్రిల్ 24: మంగాపూర్‌కు చెందిన దేవులపల్లి నవీన్‌కుమార్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డుకు ఎంపికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో స్ఫూర్తి సర్వీస్ సొసైటీ ఇండియన్ ఎన్జీవో సంస్థ ఆధ్వర్యంలో అవార్డును అందుకున్నారు. నవీన్‌కుమార్ చేపట్టిన సేవా కార్యక్రమాలకు ఈ అవార్డును అందజేశారు.

ఉపాధి కూలీలను శ్రమదోపిడీకి గురి చేస్తున్న కేంద్రం

● డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్

గజ్వేల్, ఏప్రిల్ 24: ఉపాధిహామీ కూలీలకు కనీస వేతనాలు చెల్లించకుండా కేంద్ర ప్రభుత్వం శ్రమ దోపిడీకి గురిచేస్తుందని దళిత బహుజనఫ్రంట్ జాతీయ కార్యదర్శి పెద్దలింగన్నగారి శంకర్ పేర్కొన్నారు. మహనీయుల జయంతి మాసోత్సవం సందర్భంగా డీబీఎఫ్ చేపట్టిన భారత రాజ్యాంగ పరిరక్షణ ప్రచారంలో భాగంగా బుధవారం గజ్వేల్ మండలం జాలిగామకు చేరుకుంది. చెరువులో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలను కలిసి వారి సమస్యలను శంకర్ తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉపాధి కూలీలకు కనీస కూలీ రూ. 300లు పెంచినప్పటికీ ఆచరణలో కూలీలకు రూ.70 నుంచి రూ100 లోపే చెల్లిస్తున్నారని ఆరోపించారు. పని పరికరాలను అందించకపోవడంతో ఇబ్బందుల పాలు అవుతున్నామని కూలీలు తమ దృష్టికి తెచ్చారని శంకర్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఆన్‌లైన్ హాజరు పేరుతో అమలు చేస్తున్న నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టం వల్ల కూలీల హాజరు తీసుకోవడం చాలా ఇబ్బందిగా మారిందన్నారు. అంతేకాకుండా ఉపాధిహామీ చట్టాన్ని అడుగడుగునా ఉల్లంఘిస్తూ నిధులను తగ్గిస్తున్న భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బరితెగించి ప్రకటిస్తున్న బిజెపిని ఓడించాలని, భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని శంకర్ పిలుపునిచ్చారు. ఆయనతో ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా కార్యదర్శి బ్యాగరి వేణు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రభుత్వ కళాశాలలకు ఉత్తమ ఫలితాలు

సిద్దిపేటరూరల్/సిద్దిపేట క్రైం, ఏప్రిల్ 24: బుధవారం విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో సిద్దిపేట రూరల్ మండలం ఇరుకోడు గ్రామంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారు. ఫస్టియర్ బైపీసీ విభాగంలో టి. రమ్య 405, బి. అక్షయ 403, ఎంపీసీ విభాగంలో నూర్నీస్సా460, పి. శశికాంత్ 452, కె.ప్రణతి 451, కె శ్రీవల్లి 449, ఆర్.సరళ 442 మార్కులు సాధించారు. రెండవ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎం. వెన్నెల 942, శ్రావణి 941 మార్కులు సాధించగా పాఠశాల ప్రిన్సిపాల్ బుచ్చిబాబు, ఉపాధ్యాయులు అభినందించారు. కాగా ఇంటర్ ఫస్టియర్ ఫలితాల్లో సిద్దిపేట అంబిటస్ స్కూల్ పూర్వ విద్యార్థిని కావ్య ఎంపీసీలో రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచి 468/470 మార్కులు సాధించారు. ఈ సందర్భంగా అంబిటస్ స్కూల్ యజమాన్యం కావ్యను శాలువాతో ఘనంగా సన్మానించారు. తమ స్కూల్ లో టెన్త్ వరకు చదివిన విద్యార్థిని ఇంటర్లో రాష్ట్రస్థాయి ర్యాంకు సాధించడం తమకు గర్వకారణమని స్కూల్ ప్రిన్సిపాల్ ఎడ్ల జ్యోతి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

● **గజ్వేల్:** గజ్వేల్‌లోని మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండియర్‌లో మొత్తం వందమంది విద్యార్థులకు గానూ 61మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో 88మంది విద్యార్థులకు గానూ 36మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. అదేవిధంగా ప్రభుత్వ బాలుర కళాశాలలో సెకండియర్‌లో 124మంది, ఫస్టియర్‌లో 120మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కస్తూర్బాగాంధీ కళాశాలలో ఫస్టియర్‌లో 52మంది, సెకండియర్‌లో 63మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 85శాతం ఉత్తీర్ణత సాధించారు. ఇంటర్ పరీక్షా ఫలితాల్లో గజ్వేల్ పట్టణానికి చెందిన గీతాంజలి జూనియర్ కళాశాల విద్యార్థిని సాత్విక 470మార్కులకు గానూ 468 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో సత్తా చాటింది.

● **హుస్నాబాద్:** ఇంటర్ ఫలితాల్లో హుస్నాబాద్ ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబర్చి అత్యుత్తమ మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ రవీందర్ తెలిపారు. కళాశాలలో మొదటి సంవత్సరంలో 60 శాతం, ద్వితీయ సంవత్సరంలో 84 శాతం ఉత్తీర్ణత పొందారు. పట్టణంలోని ప్రభుత్వ బాలుర కళాశాల ఫస్టియర్‌లో 37 శాతం, సెకండియర్‌లో 54 శాతం ఉత్తీర్ణత సాధించారు.

● **నంగునూరు:** మండలంలోని అక్కెనపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్మీడియట్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. ఇంటర్ ఫస్టియర్‌లో 84 శాతం, సెకండియర్‌లో 99 శాతం ఫలితాలు సాధించినట్లు మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ యం.రవీందర్‌గౌడ్ తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఆయన అభినందించారు. అక్కెనపల్లి మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 74 మంది, సెకండియర్‌లో 72 మంది ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వెల్లడించారు. నంగునూరు జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 40మంది, సెకండియర్ లో 61మంది ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కిషన్ తెలిపారు

● **కొండపాక:** కొండపాక మోడల్ స్కూల్‌లో ఇంటర్ సెకండియర్ ఫలితాల్లో 71శాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ వన్నీసా తెలిపారు. సెకండ్ ఇయర్‌లో బి. గీత ఎంపీసీ విభాగంలో 974 మార్కులు సాధించి కాలేజీ టాపర్‌గా నిలిచినట్టు తెలిపారు. అలాగే ఫస్టియర్ ఫలితాల్లో 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు.

● **చిన్నకోడూరు:** చిన్నకోడూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ సెకండియర్‌లో 84 మంది విద్యార్థులకు గాను 7 మంది, ప్రథమ సంవత్సరంలో 53 మంది విద్యార్థులకుగాను ఒక్క విద్యార్థి మాత్రమే ఉత్తీర్ణత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ భూపాల్ రాజు తెలిపారు. మండలంలోని ఇబ్రహీంనగర్ మోడల్‌స్కూల్‌లో ఇంటర్మీడియట్ సెకండియర్‌లో 27 శాతం, ఫస్టియర్‌లో 12శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ పద్మలత తెలిపారు.



సిద్దిపేట క్రైం: ఇంటర్ ఫస్టియర్‌లో రాష్ట్రస్థాయి అత్యుత్తమ మార్కులు సాధించిన కావ్యతో అంబిటస్ స్కూల్ యజమాన్యం, తల్లిదండ్రులు

● **బెజ్జంకి:** ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, మోడల్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫస్టియర్‌లో 22 శాతం, సెకండియర్‌లో 61 శాతం ఉత్తీర్ణత సాధించారు. మోడల్ కళాశాలలో ఫస్టియర్‌లో 51 శాతం, సెకండ్ ఇయర్‌లో 83శాతం ఉత్తీర్ణతను సాధించారు.

● **మద్దూరు:** మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించారు. సెకండియర్ ఎంపీసీలో మరియాజమీర్ 982/1000, బైపీసీలో తాడూరి శృతి 869/1000, సీఈసీలో ఎన్. రాజ్‌కుమార్ 766/1000, ఫస్టియర్ ఎంపీసీలో ఉమ్మెకుల్సుమ్ 459/470, బైపీసీలో ఎర్రం వైశాలి 319/440 మార్కులు సాధించారు.

● **కుకునూరుపల్లి:** లకుడారం గ్రామానికి చెందిన నాగపురి నిఖిత ఇంటర్ సెకండియర్ బైపీసీలో 927మార్కులతో ఉత్తమ ప్రతిభ కనబర్చింది. ఆమె తొగుటలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలలో విద్యను అభ్యసిస్తుంది.

చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

చేర్యాల, ఏప్రిల్ 24 : కొమురవెల్లి మండల కేంద్రంలోని కొమురవెల్లి మల్లికార్జున దేవస్థానం పరిధిలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని ఏఈవో బుద్ది శ్రీనివాస్ తెలిపారు. కొమురవెళ్లి మల్లన్నస్వామి దర్శనార్థం వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆలయం ఆధ్వర్యంలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశామన్నారు. చలి వేంద్రాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నవ వధువుకు పుస్తెమట్టెలు బహూకరణ

మర్కుక్, ఏప్రిల్ 24: మండలంలోని పాములపర్తి గ్రామానికి చెందిన తలారి సత్తమ్మ మల్లయ్యల కూతురు తలారి సౌందర్య వివాహానికి ఎంపీపీ పాండుగౌడ్ పుస్తెమట్టెలు బహూకరించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారు. ఇప్పటి వరకు సుమారుగా 200 మంది వధువులకు పుస్తెమట్టెలు అందజేసి ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్నాడని గ్రామస్థులు, బంధువులు ఎంపీపీకి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా పాండుగౌడ్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తానన్నారు. వారితో మాజీ యూత్ ప్రెసిడెంట్ కరుణాకర్, నాయకులు చెక్కలి రాములు, తాజా మాజీ వార్డు సభ్యులు గణేష్, చాకలి నర్సింహులు, కృష్ణ, రమేశ్ ఉన్నారు.



నవ వధువుకు పుస్తెమట్టెలు అందజేస్తున్న పాండుగౌడ్